సాక్షి
అనంతపురం

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



కత్తితో పొడిచి.. గొంతు కోసి

గుంతకల్లుకు చెందిన యువకుడు వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి శివారులో హత్యకు గురయ్యాడు.

IIలో



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
42.2°/24.4°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నమోదయ్యాయి. ఉక్కపోత తీవ్రంగా ఉంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర వర్షం పడింది.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

కళ్యాణదుర్గం/కంబదూరు: పెండింగ్ కేసుల పరిష్కారంలో చొరవ చూపాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన కళ్యాణదుర్గం డీఎస్పీ కార్యాలయం, పట్టణ, రూరల్ సర్కిల్ కార్యాలయాలతో పాటు కంబదూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లలో సిబ్బంది, కేసుల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐలు తేజమూర్తి, శ్రీనివాసులు, ఎస్‌ఐలు నాగమధు, సుధాకర్, రాజేష్ ఉన్నారు.

తేలికపాటి వర్షం



అనంతపురం అగ్రికల్చర్: వాతావరణ మార్పులతో జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు తాడిపత్రి, గుమ్మఘట్ట, యాడికి, రాయదుర్గం, అనంతపురం, నార్పల, పుట్లూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, పామిడి, కూడేరు, ఆత్మకూరు, ఉరవకొండ, కంబదూరు, గుత్తి, గుంతకల్లు, పెద్దవడుగూరు బొమ్మనహాళ్, వజ్రకరూరు తదితర మండలాల్లో 15 నుంచి 2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. వడగాలులు, ఉక్కపోత అధికంగా నెలకొంది. రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ శనివారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నందున దాని ప్రభావంతో వాతావరణంలో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. సాధారణం కన్నా పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చన్నారు. ఈదురుగాలులు వీచే సూచన ఉందని తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షపాతం నమోదు కావొచ్చన్నారు.

టమాట కిలో రూ.6



అనంతపురం అగ్రికల్చర్: కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.6, కనిష్టంగా రూ.2.50, సరాసరి రూ.4 మేర పలికింది. మార్కెట్‌కు 15 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చినట్లు ఏడీఎం సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

సంబంధాలు సరికొత్తగా..

పెళ్లి సంబంధం కుదరడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అమ్మాయికి అబ్బాయి నచ్చాలి. సంపాదన ఏడాది ప్యాకేజీ ఎంత అన్నదీ కీలకంగా చూస్తున్నారు. 'ప్యాకేజీ' నచ్చితేనే అమ్మాయితో పాటు కుటుంబ సభ్యులు ఓకే చేస్తున్నారు. లేకుంటే మరో ఆప్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. అంతేకాదు పెళ్లి చూపులు కూడా సరికొత్త రూపు దాలుస్తున్నాయి. వధువు ఇంట జరగాల్సిన పెళ్లి చూపులకు హోటళ్లు.. ఇతర ప్రదేశాలు వేదికగా సాగుతున్నాయి.



- ప్యాకేజీ నచ్చితేనే గ్రీన్ సిగ్నల్
- హంగూ ఆర్భాటం లేకుండా హోటళ్లలో పెళ్లి చూపులు
- ఉద్యోగం చేస్తున్న అమ్మాయిలకైతే కానుకల్లో వెసులుబాటు
- ఉమ్మడి కుటుంబమున్న అబ్బాయి వద్దంటున్న అమ్మాయిలు
- భూములుండి ఉద్యోగం లేని వరుడి వైపు కన్నెత్తి చూడని వధువు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

▸ అనంతపురం నగరానికి చెందిన దీప్తి డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఇదే జిల్లాకు చెందిన అబ్బాయి రాకేష్ కాలిఫోర్నియాలో ఉంటున్నాడు. అక్కడే వీరిద్దరి పెళ్లిచూపులు అయ్యాయి. వచ్చే నెల ఇండియాలో పెళ్లి జరగబోతోంది.

▸ గుంతకల్లుకుచెందిన సురేష్‌కు నాలుగైదు సంబంధాలు వచ్చినా.. కుదరలేదు. కారణమేంటంటే.. అతనికి ముగ్గురు అక్కచెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. ఆడపిల్లలకు పెళ్లిళ్లయినా పెద్ద కుటుంబం కదా ఇంతమందికి పెట్టుపోతలు కష్టమని అమ్మాయి తరఫు వారు వెనక్కు తగ్గుతున్నారు.

▸ ఆస్తులు, అంతస్తులు.. ముందు పది తరాలు, వెనుక పది తరాలు.. బలమూ బలగమూ ఇవి ఉంటే చాలు గతంలో అమ్మాయికి ఎలాంటి ఢోకా లేదని పెళ్లి కుదుర్చుకునే వారు. రానురాను కాలం మారింది. ఆస్తులేమోగానీ బలమూ బలగానికి చోటు లేదు. ఇప్పుడంతా 'ప్యాకేజీ'లే. నెలజీతం ఎవరూ అడగడం లేదు. వార్షిక ప్యాకేజీ (యాన్యువల్ ప్యాకేజీ)ని బట్టి పెళ్లిళ్లు కుదిరిపోతున్నాయి. ప్యాకేజీ లేకపోతే వందెకరాల భూస్వామి కొడుక్కు కూడా పిల్లనిస్తామని వచ్చేవారు లేరు. అదే హైదరాబాద్.. బెంగళూరుల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ అబ్బాయిలు, అమ్మాయిలకు అయితే డిమాండ్ బాగుంది.

అమ్మాయిల ప్యాకేజీల పైనా ఆరా..

అబ్బాయికి ఏడాదికి రూ.25 లక్షలు ప్యాకేజీ అయినంత మాత్రాన పదో తరగతి చదివిన అమ్మాయిని ఒప్పుకునే పరిస్థితి లేదు. ఉద్యోగం చేస్తున్న అమ్మాయిలకు, అదీ మంచి ప్యాకేజీతో వేతనం ఉన్న వారికి త్వరగా పెళ్లిళ్లు కుదురుతున్నాయి. ఉద్యోగం చేస్తున్న అమ్మాయిల విషయంలో కట్న కానుకలు రెండో ప్రాధాన్యత అంశంగా మారింది. కానుకల విషయంలో వెసులుబాటూ కలుగుతోంది.

డాక్యుమెంట్లు చూపించండి

ఆస్తులు, డబ్బే ఇప్పుడు పెళ్లిళ్లను కుదురుస్తున్నట్టుంది. ఆస్తులున్నట్టు చెబితే డాక్యుమెంట్లు అడుగుతున్న వారూ లేకపోలేదు. ఉమ్మడి ఆస్తులకు లెక్కచెప్పండి.. నీ వాటా ఎంత వస్తుంది, ఎప్పుడు పంచుకుంటున్నారు..మార్కెట్ వ్యాల్యూ ఎంత ఉంటుంది. ఇలాంటివన్నీ అడుగుతున్న పరిస్థితి. కొన్నిసార్లు ఇలాంటి ప్రశ్నలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి.

విదేశాల్లోనే వివాహ బంధాలు

అమెరికా, కెనడాల్లో స్థిరపడిన అబ్బాయిలు, అమ్మాయిలు.. సమీప బంధువులు, మిత్రుల సహకారంతో అక్కడే పెళ్లిచూపులు పూర్తి చేస్తున్నారు. ఇక్కడి తల్లిదండ్రులు ఆస్తులు, ఇళ్లు, డబ్బు వగైరాలు ఆరా తీసి ఓకే చేస్తున్నారు. ఇలా అయితే ప్రత్యేకంగా హెచ్1 వీసాలు, డిపెండెంట్ వీసాలు అక్కర్లేదని అక్కడికక్కడే సంబంధం వెతుక్కుంటున్నారు.

ఆడపడుచులు..అన్నదమ్ములు ఉంటే..

ఉమ్మడి కుటుంబమంటే పెళ్లి చూపులకు కూడా మొగ్గుచూపని పరిస్థితి నెలకొంది. చివరకు అబ్బాయి తరఫున ఆడపడుచులు ఎక్కువ మంది ఉన్నా ఇలాంటి వాటికి అమ్మాయి తరఫు వాళ్లు మక్కువ చూపడం లేదు. 'ఇంతమందికి మా అమ్మాయి సేవలు చేయలేదు' అని ముఖాన్నే చెప్పేస్తున్నారు. పెళ్లవగానే అబ్బాయి వేరు కాపురం పెడితేనే వస్తామనే అమ్మాయిలూ లేకపోలేదు.

హోటళ్లలోనే పెళ్లిచూపులు

కొన్ని సామాజిక వర్గాల్లో పెళ్లి చూపులు ఇంటివద్ద చేయడం లేదు. ఎక్కువ సంబంధాలు వచ్చి వెనక్కు వెళుతున్నాయన్న వంక చూపిస్తారని..హోటళ్లలోనే పెళ్లి చూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇరువురూ మాట అనుకోవడం.. హోటల్‌కు రావడం కాఫీ తాగుతూ అబ్బాయి.. అమ్మాయి మాట్లాడుకోవడం. ఇదీ పెళ్లిచూపుల తంతు. ఎలాంటి హంగూ ఆర్భాటాలూ లేకుండా కాఫీతోనే పెళ్లి చూపులు ముగుస్తున్నాయి.

'ప్యాకేజీ'కే ప్రాధాన్యం



రెండు దశాబ్దాల కిందటితో పోలిస్తే ఇప్పుడు వధూవరులంతా ఏడాది వేతనాని (యాన్యువల్ సాలరీ ప్యాకేజీ)కే ప్రాధాన్యమిస్తున్నారు. ఈడు జోడు, జాతకాలు, ఇతరత్రాలు అన్నీ గొప్ప సంపాదన ముందు తక్కువే అని వధూవరులు భావిస్తున్నారు. కొంతమంది పిల్లలు మంచి కెరియర్ ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు

– బత్తలపల్లి సత్య రంగారావు, వధూవరుల పరిచయ వేదిక

పిల్లల అభిప్రాయాలదే చెల్లుబాటు



మేము పాతికేళ్లుగా వివాహాలు చేయిస్తున్నాం. ముందు రోజుల్లో తల్లిదండ్రులు తెచ్చిన సంబంధాన్ని ఆలోచించకుండా ఒప్పుకునేవారు. ఇప్పుడు పిల్లల అభిప్రాయానికే తల్లిదండ్రులు ప్రాముఖ్యతను ఇస్తున్నారు. వివాహాది సంప్రదాయాలు కూడా పూర్తిగా మారిపోయాయి. అతి స్వేచ్ఛ వల్ల కూడా చాలా వివాహ బాంధవ్యాలలో ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి.

–గరుడాద్రి సురేష్ శర్మ, పురోహితులు

కట్టకిందపల్లి పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు



కట్టకిందపల్లి పంచాయతీ కార్యాలయం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి పంచాయతీ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 24న పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేయనున్నారు. అనంతపురం ఈఓఆర్డీ అలివేలమ్మ మాట్లాడుతూ పంచాయతీల్లో 'స్థిరమైన అభివృద్ధి' సాధించేందుకు పంచాయతీరాజ్ శాఖ మొత్తం 9 లక్ష్యాలను పెట్టుకుందన్నారు. ఇందులో 'సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ' లక్ష్యంలో కట్టకిందపల్లి పంచాయతీ ఎంపిక కావడం సంతోషకరమన్నారు. రేపు పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి అవార్డు అందుకోనున్నారని తెలియజేశారు.

సౌత్‌జోన్ టోర్నీలో అనంత జట్టు విజయం

కడప స్పోర్ట్స్: ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్స్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో అనంతపురం జట్టు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. జట్టులోని తౌఫిక్ హుస్సేన్ 51 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు వినయ్‌కుమార్, దీపక్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 14.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులోని ఎం.కె.దత్తారెడ్డి 56 పరుగులు, యోగానంద 34 పరుగులు చేశారు. దీంతో అనంత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు



అనంతపురం హౌసింగ్‌బోర్డు ఈద్గా మైదానంలో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈద్ ముబారక్

రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం ఉదయాన్నే జిల్లా వ్యాప్తంగా ఈద్గా మైదానాలు, మసీదులు ముస్లింలతో పోటెత్తాయి. మత పెద్దలు రంజాన్ విశిష్టతను, ముస్లింలు పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, మేయర్ వసీం

ప్రైవేట్ పాఠశాలలకు శుభవార్త

- గుర్తింపు గడువు 8 ఏళ్లకు పెంపు

రాప్తాడు రూరల్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు/ రెన్యూవల్స్ గడువును మూడు నుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ జీఓ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం అనంతపురం పర్యటనకు వచ్చిన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మీడియాకు వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు విషయమై ఎన్నికల సమయంలో యాజమాన్యాలకు మాట ఇచ్చామన్నారు. గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు, ప్రభుత్వ మహిళా టీచర్ల చైల్డ్‌కేర్ సెలవులు 180 దినాలు సర్వీసులో ఎప్పుడైనా వాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలంటూ కోరామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఈ మేరకు ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యూవల్ 3 నుంచి 8 ఏళ్లకు పెంచుతూ 38 జీఓ విడుదల అయ్యిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల తరఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వ టీచర్ల చైల్డ్ కేర్ లీవ్‌కు సంబంధించిన జీఓ ఫైనాన్స్ విభాగంలో ఉందన్నారు. త్వరలోనే ఆమోదం వస్తుందన్నారు. ఈ విషయంలో సహకరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) చీఫ్ కోఆర్డినేటర్ రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కన్వీనర్ నాగరాజు, జాయింట్ సెక్రటరీ రఘునాథారావు, ఈసీ మెంబరు శశిభూషణ్ పాల్గొన్నారు.

త్వరలోనే ప్రభుత్వ టీచర్ల బదిలీ

ప్రభుత్వ టీచర్ల బదిలీలు త్వరలోనే ఉంటాయని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం అనంతపురం కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పదో తరగతి 'స్పాట్' కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి డీఈఓను అభినందించారు. స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ పెంచడం పట్ల సీఎం, ఎమ్మెల్సీలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలు సమస్యలపై ఎమ్మెల్సీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. డీఈఓ కార్యాలయ శాశ్వత భవన నిర్మాణ అంశాన్ని త్వరలోనే సీఎంతో చర్చిస్తానన్నారు. ఈ సందర్భంగా డీఈఓ సాయిరామ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేట్ పాఠశాలల యజమానులు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. ఆయన వెంట పీఆర్టీయూ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు అశోక్‌కుమార్ రెడ్డి, గోవిందరెడ్డి, రవీంద్రారెడ్డి, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం సంఘం నాయకులు పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



'స్పాట్' కేంద్రంలో ఎమ్మెల్సీని సన్మానిస్తున్న డీఈఓ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

డీజిల్ బదులు నీళ్లు వేశారు!

- 'పరిటాల' పెట్రోల్ బంక్‌లో మాయాజాలం
- రూ.1.20 కోట్ల కారు కరాబు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కల్తీ ఇంధనం కారణంగా కారు కరాబైంది. పెట్రోల్ బంకులో డీజిల్ వేయించుకుని పది అడుగుల దూరం వెళ్లగానే ఇంజిన్ మొరాయించింది. ఇంధనం కల్తీ అని గుర్తించి కారు యజమాని ప్రశ్నిస్తే డీలర్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. చివరకు బాధితుడు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. జేఎన్‌టీయూ కళాశాల సమీపంలోని శ్రీరేణుకా ఫర్టిలైజర్స్ యజమాని జేసీ రవీంద్రారెడ్డి శనివారం వ్యక్తిగత పని మీద ధర్మవరం వెళ్లాల్సి వచ్చింది. రాత్రి పది గంటల సమయంలో తన కారులో డ్రైవర్‌తో కలిసి బయల్దేరారు. ఇంధనం కోసం కళ్యాణదుర్గం బైపాస్ - రుద్రంపేట బైపాస్ మార్గంలోని శ్రీరామ పెట్రోలియం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (పరిటాల రవి పెట్రోల్)బంక్ వద్దకు వచ్చారు. అక్కడ 46 లీటర్ల డీజిల్ వేయించుకున్నారు. అయితే కారు పెట్రోల్ బంకు ఆవరణం దాటకముందే ఆగిపోయింది. సెన్సార్ సంకేతాలు పరిశీలించగా నాజిల్ పనిచేయలేదని తెలిసింది. అనుమానం వచ్చి చూస్తే వేయించుకున్న డీజిల్‌లో కల్తీ జరిగి ఉంటుందని గుర్తించారు. డీలర్ సందిరెడ్డి శ్రీనివాసులును ప్రశ్నిస్తే సరైన సమాధానం రాలేదు. మీ బండిలోనే ఇంధనం కల్తీ అయ్యుండొచ్చంటూ బుకాయించడంతో బాధితుడు రవీంద్రారెడ్డి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. రూ.1.20 కోట్లు విలువ చేసే ఓల్వో ఎక్స్‌సీ 90 కారు కల్తీ డీజిల్ కారణంగా పాడైపోయిందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. డీలర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కారు నాజిల్‌ను పరిశీలించగా నీరు కనిపించడంతో... దాన్ని ఒక బాటిల్‌లోకి నింపి తహసీల్దార్ శ్రీధర్ మూర్తికి అందజేశారు. కారు రిపేరీ చేయించాలంటే రూ.30లక్షల దాకా ఖర్చవుతుందని షోరూం నిర్వాహకులు చెప్పారన్నారు.




డీజిల్‌లో కలిసిన నీటిని బాటిల్‌లో నింపిన దృశ్యం..



మొరాయించిన కారు

క్లుప్తంగా

ఇంటిపై పిడుగు



పిడుగు పడడంతో ఇంటి పైకప్పుకు ఏర్పడిన రంధ్రం

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో చిన్న ఓబులరెడ్డి ఇంటిపై పిడుగు పడడంతో పైకప్పుకు పెద్ద రంధ్రం ఏర్పడింది. ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు.

స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం) కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వైద్య నిపుణులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులను డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలి. వైద్యుల పోస్టులు, ఖాళీల వివరాలు, విద్యార్హతలు, మరిన్ని వివరాలకు https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

126 స్కూళ్లు... 275 మంది ఎంపిక

- విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా నిరుపేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశాలు
- ప్రారంభమైన రెండోవిడత అడ్మిషన్ల ప్రక్రియ
- కోరుకున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు
- ఈ నెల 29న రెండో విడత విద్యార్థులకు లాటరీ



రాప్తాడు రూరల్: విద్యాహక్కు చట్టం 12(1)(సి) అమలులో భాగంగా నిరుపేద విద్యార్థుకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. రెండు విడతలకు గాను తొలివిడత ఎంపిక ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 645 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల నివాసాలకు ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న స్కూళ్ల జాబితాను ఎంచుకున్న మేరకు లాటరీ ద్వారా విద్యార్థులను విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ ప్రక్రియ మొత్తం అమరావతిలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగింది. లాటరీలో జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 126 స్కూళ్లలో 275 మంది విద్యార్థులకు చోటు దక్కింది. సమాచారం అందుకున్న మండలాల ఎంఈఓలు విషయాన్ని వెంటనే ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు చేరవేశారు. అలాగే ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు కూడా పంపారు. ఈ నెల 25లోపు అడ్మిషన్లు పూర్తవ్వాలని ఆయా పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. దీంతో ఇప్పటి వరకూ 170 మంది అడ్మిషన్లు పొందారు.

29న రెండో విడత లాటరీ

రెండో విడత లాటరీ ఈ నెల 29న చేపట్టనున్నారు. తొలివిడతలో ఒక కిలోమీటరు పరిధిలోని స్కూళ్లను తీసుకోగా, రెండో విడతలో మూడు కిలోమీటర్ల పరిధిలోని స్కూళ్లను తీసుకుంటారు.

ఆంక్షలు విధిస్తే చర్యలు తప్పవు

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)(సి) మేరకు ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు యాజమాన్యాలు ఎలాంటి ఆంక్షలు పెట్టరాదు.ఆయా విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశాలు కల్పించాలి. ఎక్కడైనా ఆంక్షలు విధించినట్లు తెలిస్తే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– సాయిరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి

తొలివిడతలో ఎంపికైన వారిలో ఎవరైనా సదరు పాఠశాలల్లో చేరకుంటే ఆ ఖాళీలను సైతం రెండో విడతలో భర్తీ చేయనున్నారు.

అత్యధికంగా అనంతపురంలో...

తొలివిడతలో ఎంపికైన విద్యార్థుల్లో అత్యధికంగా 49 మంది అనంతపురం అర్బన్, రూరల్ మండలాల్లోని వారే ఉండడం గమనార్హం. ఉరవకొండలో 46, గుంతకల్లులో 36, కళ్యాణదుర్గంలో 31, గుత్తి, రాయదుర్గం మండలాల్లో 30, తాడిపత్రిలో 13 మంది ఎంపికయ్యారు. మిగిలిన మండలాల్లో ఏడుగురు నుంచి ఒక విద్యార్థి వరకూ ఉన్నారు.

బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోండి



కలెక్టర్ గౌతమికి వినతి పత్రం ఇస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి

అనంతపురం: నగర కార్పొరేషన్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు పేరుకుపోయిన మొండి బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి విన్నవించారు. ఈ మేరకు శనివారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రంథాలయ సెస్ చెల్లింపులో కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని, ఫలితంగా గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడుతోందని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కొమ్మా శివశంకర్, ప్రసాద్, లైబ్రేరియన్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ విగ్రహావిష్కరణ



అమర్‌నాథ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

పామిడి: వీరమరణం పొందిన జవాన్, పామిడి మండలం వంకరాజుకాలువ అమర్‌నాథ్ సేవలు ఎనలేనివంటూ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. పెన్నప్ప గుడి వద్ద వీరజవాన్ అమర్‌నాథ్ విగ్రహాన్ని శనివారం వారు ఆవిష్కరించి, మాట్లాడారు. అనంతరం జెడ్పీ నిధులతో గ్రామంలో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు.

కత్తితో పొడిచి.. గొంతు కోసి!

- యువకుడి దారుణ హత్య
- హతుడు గుంతకల్లు నివాసి



దూదేకుల అబ్దుల్లా మృతదేహం

వజ్రకరూరు: మండలంలోని బోడిసానిపల్లి శివారులో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కత్తితో పొడిచి.. గొంతుకోసి హతమార్చినట్లుగా తెలుస్తోంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని బెస్త కాలనీకి చెందిన రసూల్‌బీ, మస్తానయ్య దంపతులకు ఓ కుమారుడు దూదేకుల అబ్దుల్లా (31), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అవివాహితుడైన అబ్దుల్లా... అద్దె ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఆటో తీసుకుని బయలుదేరిన అబ్దుల్లా తిరిగి ఇల్లు చేరలేదు. శనివారం ఉదయం బోడిసానిపల్లి పల్ల వద్ద ఓ యువకుడు హత్యకు గురైనట్లు స్థానికుల సమాచారం అందుకున్న డీఎస్పీ నర్సింగప్ప, సీఐ శేఖర్, ఎస్ఐ వెంకటస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. కత్తితో పొడిచి, గొంతు కోసి హతమార్చినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. లభ్యమైన ఆధారాలను బట్టి గుంతకల్లులోని వార్డు వలంటీర్ ద్వారా హతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటినా అక్కడకు చేరుకున్న రసూల్‌బీ, కుటుంబసభ్యులు, బంధువులు... హతుడిని అబ్దుల్లాగా నిర్ధారించారు. శుక్రవారం ఉదయం ఆటో తీసుకుని బయలుదేరాడని, తిరిగి ఇంటికి చేరుకోలేదని రసూల్‌బీ పోలీసులకు వివరించింది. ఇలా హత్యకు గురవుతాడని తాము అనుకోలేదని బోరున విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, హత్యకు కారణాలు, ఎవరు చేశారనేది తెలియాల్సి ఉంది..

వివాహిత ఆత్మహత్య



భవాని మృతదేహం

శెట్టూరు: జీవితంపై విరక్తి పెంచుకున్న ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం కైరేవు గ్రామానికి చెందిన బోయ రమేష్, భవాని (24) దంపతులకు ఓ కుమార్తె ఉంది. కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతున్న భవానీకి కుటుంబ సభ్యులు చికిత్సలు చేయించారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కడుపు నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ యువరాజ్ తెలిపారు.

బావిలో పడి యువతి మృతి



అంజినమ్మ మృతదేహం

రాయదుర్గం టౌన్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని 30వ వార్డులో నివాసముంటున్న ఓబన్న కుమార్తె అంజినమ్మ (32) మానసిక్థితి సరిగా లేదు. దీంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఒకట్రెండు రోజులు కనిపించకుండా పోయేది. బంధువులు, కుటుంబసభ్యులు గాలించి ఆమెను పట్టుకుని తిరిగి ఇంటికి చేర్చేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అంజినమ్మ తిరిగి రాలేదు. శనివారం ఉదయం రాయదుర్గం కొండపై వెలసిన శ్రీరాముడి ఆలయం సమీపంలో ఉన్న బావిలో ఆమె మృతదేహాన్ని గొర్రెల కాపర్లు గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. ప్రమాదవశాత్తు ఆమె బావిలో పడి మృతి చెంది ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ దిశగా కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కేజీబీవీల పర్యవేక్షణ పక్కాగా ఉండాలి

- స్పెషల్ ఆఫీసర్లకు సమగ్ర శిక్ష డీపీఓ సాయిరామ్ ఆదేశం



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీపీఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: అభాగ్యులు, నిరుపేద బాలికల చదువుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని ప్రత్యేకాధికారులను సమగ్ర శిక్ష డీపీఓ సాయిరామ్ ఆదేశించారు. కేజీబీవీల నిర్వహణలో లోపాలు తలెత్తినా... బాలికలకు ఏ చిన్న ఇబ్బంది కలిగినా సంబంధిత ప్రత్యేకాధికారిని ఇంటికి పంపడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. శనివారం ఆయన కేజీబీవీ ఎస్ఓలతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కేజీబీవీల్లో విద్యార్థినుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. మెనూ అమలు సక్రమంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణలో లోపాలు తలెత్తరాదని సూచించారు.

'మూల్యాంకనం' కేంద్రంలోకి ఎవరూ రావొద్దు

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రంలోకి అనవసరంగా ఎవరూ రాకూడదని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విధుల్లో పాల్గొనేందుకు ఉత్తర్వులు అందుకున్న ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లు మినహా ఇతరులు ఎవరూ ఆ ప్రాంతంలో ఉండరాదన్నారు. ఏదైనా అత్యవసర పని ఉంటే సాయంత్రం 4:30 గంటల తర్వాత ముందస్తు అనుమతితో లోపలికి రావాలని సూచించారు.

ఈ అభివృద్ధి కనిపించలేదా?

- టీడీపీ నేతలను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య
- సెల్ఫీలతో ప్రజలను చైతన్య పరచాలని పార్టీ శ్రేణులకు పిలుపు



అనంతపురం కోర్టు రోడ్డులోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న పైలా

అనంతపురం క్రైం: అభివృద్ధి అంటే ఏమిటో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ప్రజలకు తెలుస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ప్రజలను చైతన్య పరిచేలా అనంతపురంలోని కోర్టురోడ్డులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యం కేంద్రం వద్ద ఆయన సెల్ఫీదిగి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. నాడు–నేడు కార్యక్రమాలతో పాటు ప్రాధాన్యత క్రమంలో ఆస్పత్రులు, పాఠశాలలు, రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులను ఎక్కడే గాని అవినీతికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన కేవలం రెండున్నరేళ్లలోనే అభివృద్ధి పథకంలో రాష్ట్రం దూసుకెళుతుండడంతో గిట్టని టీడీపీ నాయకులు సెల్ఫీ డ్రామాలతో ప్రజలను పెడతోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో జగన్ సర్కార్ సాధించిన ప్రగతిపై సెల్ఫీలతో ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ప్రతి కార్యకర్త ఉద్యమంలా కొనసాగించాలన్నారు. ఏ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వంపై బురద చల్లుతున్నారో.. అవే మాధ్యమాల ద్వారా టీడీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పామిడి: కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన శంకర్‌నాయక్ (45) హత్యకేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పామిడి సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం వెల్లడించారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునే శంకర్ నాయక్‌కు అదే గ్రామానికి చెందిన మంగల రాజీతో వివాహేతర సంబంధం ఉండేది. ఈ క్రమంలో ఆమెకు రూ.లక్ష వరకూ అప్పుగా ఇచ్చాడు. భర్త మృతితో రాజీ పామిడి మండలం రామగిరిలోని పుట్టింటికి చేరుకుని తల్లితో కలసి జీవిస్తోంది. ఈ క్రమంలో శంకర్‌నాయక్ తరచూ రామగిరికి వచ్చి వెళుతుండేవాడు. తానిచ్చిన రూ.లక్ష ఇవ్వాలంటూ మద్యం మత్తులో గొడవకు దిగేవాడు. దీంతో శంకర్ నాయక్‌ను హతమార్చేందుకు తన తల్లి నారాయణమ్మ, సమీప బంధువైన విడపకల్లు మండలం వి.కొత్తకోట నివాసి సాయినాథ్‌తో కలసి రాజీ పథకం వేసింది. ఇందులో భాగంగా ఈ నెల 9న రామగిరికి వచ్చిన శంకర్‌నాయక్ రాత్రి 9 గంటలకు రాజీతో డబ్బు కోసం గొడవ పడ్డాడు. అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న కారంపొడిని అతని కళ్లలోకి రాజీ చల్లింది. శంకర్‌నాయక్ రెండు కాళ్లు కదలకుండా తల్లి నారాయణమ్మ పట్టుకోవడంతో సాయినాథ్ సూరకత్తి, రాజీ కూరగాయలు కోసే కత్తితో గొంతు కోశారు. అనంతరం అదే రోజు రాత్రి 11.30 గంటలకు శంకర్‌నాయక్ మృతదేహాన్ని గోనెసంచిలో స్కూటర్‌పై సాయినాథ్, రాజీ తీసుకొచ్చి రైల్వేట్రాక్‌పై పడేశారు. గోనెసంచిని అక్కడే కాల్చివేశారు. అనంతరం పోలీసుల విచారణకు భయపడి శుక్రవారం రామగిరి వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

ఆదరణ సేవా ట్రస్ట్‌కు సామగ్రి అందజేత



సామగ్రిని ఆదరణ సేవా ట్రస్ట్‌కు అందిస్తున్న వలిబాషా, సునీర దంపతులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ఆజాద్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆదరణ సేవా ట్రస్ట్‌కు హౌసింగ్ బోర్డుకు చెందిన షేక్ వలిబాషా, సునీర దంపతులు రూ. 37 వేలు విలువజేసే సామగ్రి అందించారు. పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకొని ఆదరణ ట్రస్ట్‌కు వారు అందించారు. కార్యక్రమంలో ఆదరణ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు లాల్‌బాషా, ఉపాధ్యక్షురాలు ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

25న వైఎస్సార్ ఆసరా సభ

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఈనెల 25న వైఎస్సార్ మూడో విడత ఆసరా సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి



జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్లు ఇస్తున్న నాయకులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి జరుగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని గ్రామాల్లో జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లో ప్రతి గడపకూ తిరిగి సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు.కార్యక్రమంలో గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు , ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోజూ చెత్త సేకరించాల్సిందే

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ డివిజన్లలో రోజూ చెత్త సేకరించాలని కమిషనర్ రమణారెడ్డి క్లాప్ ఆటో నిర్వాహకులను ఆదేశించారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఆనుకొని ఉన్న చెత్త సేకరణ పాయింట్‌ను కమిషనర్ పరిశీలించారు. చెత్త సేకరణ తూతూమంత్రంగా నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి డివిజన్‌లోని అన్ని వీధుల్లో చెత్త సేకరణ చేపట్టాలన్నారు. నగర ప్రజలు సైతం తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. అనంతరం కమిషనర్ నగరంలోని విద్యుత్‌నగర్, హౌసింగ్ బోర్డు, కలెక్టరేట్, సంగమేశ్‌నగర్, పాతూరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్డుపై చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

ఆదర్శ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రకళ ప్రదర్శన



సర్టిఫికెట్లతో చిన్నారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదర్శ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో శనివారం చిన్నారుల చిత్రకళ ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులకు ప్రత్యేకంగా డ్రాయింగ్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్స్, యోగా కోర్సులలో శిక్షణ ఇచ్చి, పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మాస్టర్ వినోద్ మాట్లాడుతూ చిన్నారుల్లో కొత్త ఆలోచనలను రూపుదిద్దేందుకు ఇలాంటి కోర్సులు ఎంతో దోహదం చేస్తాయన్నారు.

నేడు అక్షయ తృతీయ



బంగారు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఓ దుకాణం

అనంతపురం కల్చరల్: దానధర్మాలకు నెలవుగా భావించే అక్షయ తృతీయ వేడుకలు ఆదివారం పలు చోట్ల ఘనంగా జరుగనున్నాయి. పురాణ విశిష్టత కలిగిన ఈ పర్వదినాన పుణ్యం ఎంత చేస్తే క్షయం అనేది లేకుండా అంతామోక్ష ప్రాప్తి కలుగుతుందని శాస్త్రోక్తి. అందుకు అనుకనుగుణంగా నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు జరుగుతాయి. రాఘవేంద్రస్వామికి చందనోత్సవం నిర్వహిస్తున్నారు. ఐశ్వర్యేశ్వరుడికి ప్రత్యేక వ్రతాలు జరిపిస్తున్నారు. అక్షయ తృతీయ రోజున బంగారు కొనుగోలు చేసి దాచుకోవాలనే పద్ధతి ఉండడంతో రెండు రోజులుగా బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. తులం బంగారం రూ.56 వేలు దాటింది. అయినా కొనుగోళ్లు మరింత ఊపందుకున్నట్లు దుకాణదారులు అంటున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్



మైనార్టీలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, మేయర్ వసీం, తదితరులు



ఈద్గాలో మాట్లాడుతున్న మత పెద్ద



శుభాకాంక్షలు తెల్పుకుంటున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్ జరుపుకున్నారు. నగరంలో శనివారం ఉదయం నుంచే మసీదులు, దర్గాలకు ముస్లింలు పోటెత్తారు. హౌసింగ్‌బోర్డులోని ఈద్గా మైదానం సామూహిక ప్రార్థనలకు వేలాదిగా తరలివచ్చారు. వేర్వేరు చోట్ల జరిగిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గా మసీదు, పాతూరు జామియా మసీదు, హెచ్చెల్సీ కాలనీలోని బాహువుద్దీన్ మసీదు ప్రాంగణంలోని ఈద్గా మైదానం జనసంద్రమైంది.

ముస్లింలకు మజ్జిగ పంపిణీ

రంజాన్ వేడుకలను పురస్కరించుకుని సామూహిక ప్రార్థనల కొచ్చే వారికి కార్పొరేటర్ మునిశేఖర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం స్థానిక హెచ్చెల్సీ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ రంజాన్ మాసంతో పాటు, వేసవిని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మానవుడు స్వార్థపరుడు కాకూడదు

రాప్తాడు: స్వార్థ ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకుండా అందరికీ తమ వంతు సాయమందించే వాడే ముస్లిం అని మత పెద్ద మౌలానా నమాన్ పేర్కొన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా రాప్తాడులోని 44వ జాతీయ రహదారిపై ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. ముందుగా ప్రదర్శనగా ఈద్గా వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ జరుపుకున్నారు. శనివారం ముస్లింలు ఈద్గా దగ్గరకు వెళ్లి నమాజ్ చేశారు. హజరత్ ఇమామ్ మహమ్మద్ ప్రవక్తా అల్లా, రంజాన్ పండుగ, దాన ధర్మాలపై వివరించారు. అనంతరం దువా చదివారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు జరుపుకున్నారు. ఆత్మకూరులో ఈద్గా దగ్గర నమాజ్ తర్వాత సయ్యద్ సర్దార్‌వలి దర్గా దగ్గరకు వెళ్లి సలామ్ పాడారు. అనంతరం దర్గాలో ప్రత్యేకంగా చక్కెర చదివింపులు చేయించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మునిశేఖర్



ప్రార్థనల అనంతరం బయటకు వస్తున్న ముస్లింలు



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్



రాప్తాడులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థన చేస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్ తదితరులు



ఆత్మకూరులో సర్దార్‌వలి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

అక్రిడిటేషన్ కమిటీ అస్తవ్యస్తం

- అధిక సర్క్యులేషన్ ఉన్న తెలుగు దినపత్రికల ప్రతినిధులకు దక్కనిచోటు
- వివాదాస్పదంగా డీపీఆర్ఓ వ్యవహారం

సాక్షిప్రతినిధి, అనంతపురం: జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసే కమిటీ అస్తవ్యస్తంగా మారింది. జిల్లా పౌర సంబంధాల అధికారి కనీస అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా జాబితాను రూపొందించి కలెక్టర్‌కు పంపించారు. దీంతో అనర్హులకు కమిటీలో చోటు కల్పించినట్లైంది. వాస్తవానికి అత్యధిక సర్క్యులేషన్ కలిగిన తెలుగు, ఇంగ్లిష్ పత్రికల నుంచి ఒక్కొక్కరికి ప్రతినిధి కమిటీలో చోటు కల్పించాలి. కానీ జిల్లాలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఏ పత్రిక నుంచి కూడా ఒక్క ప్రతినిధికీ చోటు కల్పించలేదు. ఒక ఇంగ్లిష్ దినపత్రిక నుంచి ఒకరిని, నామమాత్రం సర్క్యులేషన్ కూడా లేని తెలుగు దినపత్రిక నుంచి ఒకరికి చోటు కల్పించారు. నిబంధనలు కాదని తనకు నచ్చిన కొంతమంది పేర్లతో జాబితాను కలెక్టర్ అనుమతికి పంపించారు. చాలా రోజుల తర్వాత వేస్తున్న ఈ కమిటీని పకడ్బందీగా, నిబంధనల మేరకు వేయాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై డీపీఆర్ఓ రమేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా... ' నాకు తెలీదు.. మీరు కావాలంటే కమిషనర్‌నుగానీ, కలెక్టర్‌గానీ సంప్రదించండి.. అవన్నీ నన్ను అడిగితే నేను చెప్పలేను.. మీరేదైనా ఉంటే అక్కడ చూసుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రజాసంబంధాల విభాగం కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డిని సంప్రదించగా.. అత్యధిక సర్క్యులేషన్ ఉన్న తెలుగు దినపత్రిక నుంచి ఒకరు, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి విధిగా ఒకరికి చోటు కల్పించాలని, దీనిపై కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు.

విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పూలకుంట సమీపం దుర్గం రోడ్డులోని సద్గురు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో మే 3 నుంచి 5 వరకు జరిగే విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమానికి హాజరుకావాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఆహ్వానించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ట పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చియ్యేడు కృష్ణారెడ్డి, పూలకుంట సర్పంచ్ కాటప్పగారి కృష్ణారెడ్డి, కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకుడు లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కురుబలపై దాడులు చేస్తే సహించేదిలేదు



తల్లిమడుగులలో మాట్లాడుతున్న కురుబ యువజన సంఘం నాయకులు

కనగానపల్లి: కురుబలపై దాడులు చేస్తే సహించేదిలేదని రాష్ట్ర కురుబ యువజన సంఘం అధ్యక్షుడు వసికేరి రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని తల్లిమడుగులలో ఇటీవల కురుబ నారాయణస్వామి, శారదమ్మలపై స్థానిక టీడీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర, జిల్లా కురుబ యువజన సంఘం నాయకులు గ్రామానికి వచ్చి బాధితులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని స్థల వివాదాన్ని అడ్డుపెట్టుకొని స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు కురుబలపై దాడులకు పాల్పడినట్లు తెలిపారు. మాజీ మంత్రి పరిటాల సునీత ఈవిషయాన్ని రాజకీయం చేస్తూ కురుబలను రౌడీలుగా పోల్చడం సరికాదన్నారు. కురుబలకు ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంతో మంచి పేరు ఉందని, మా అండదండలతోనే గతంలో రాజకీయ పదవులు అనుభవించారన్న విషయాన్ని ఆమె మర్చిపోయి మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ యువజన సంఘం ప్రచార కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు పామాల రాజశేఖర్, నాయకులు కప్పల సుదర్శన్, బండికుమార్, గురుమూర్తి పాల్గొన్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ప్రభుత్వం కల్పించిన రాయితీని (రిబేట్) ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఈనెల 1న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. విధిగా పన్ను ఒకేసారి చెల్లించి, నగరాభివృద్ధికి సహకరించాలన్నారు. సెలవు దినాల్లోనూ పన్ను చెల్లింపు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వం ప్రజలపై అధిక భారం పడకుండా తీసుకున్న చర్యలపై ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు.

22 రోజుల్లో రూ.8.09 కోట్లు వసూలు :

గడిచిన 22 రోజుల్లో రూ.8.09 కోట్లు వసూలైంది. గతేడాది ఈ తేదీకి రూ.6.61 కోట్లు వసూలైంది. గతేడాదితో పోల్చితే రూ.1.48 కోట్లు అదనంగా వసూలైంది. రాయితీకి మరో ఎనిమిది రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ ఏడాది మార్చి 17న ప్రభుత్వం వడ్డీ మాఫీకి అవకాశం కల్పించిన విషయం విదితమే. కేవలం 15 రోజుల్లోనే రూ.13.70 కోట్లు పన్ను వసూలైంది. రాష్ట్రంలోనే వివిధ నగరపాలక సంస్థల్లో అనంతపురం మూడో స్థానం నిలిచింది. నగరపాలక సంస్థలోని పన్ను చెల్లింపు కేంద్రంలో మూడు కౌంటర్లతో పాటు రెవెన్యూ కార్యాలయం, ఆర్ఓ కార్యాలయంలో మరో రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. వృద్ధులు, మహిళలు, తదితరులు కూర్చునేందుకు సదుపాయాలు కల్పించారు. నగరంలోని పాతూరు, నవోదయ కాలనీ, రెండో రోడ్డు, రాంనగర్‌లలోని సచివాలయాల్లో పన్ను చెల్లింపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

సేవాభావం అలవర్చుకోవాలి

అనంతపురం: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. మురళీధర్ రావు అన్నారు. ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. శనివారం కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సేవా పథకంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటే నాయకత్వ లక్షణాలు, సేవాభావం అలవడతుందన్నారు. నాట్ ఫర్ మీ బట్ యూ అనే నినాదమే ప్రధాన ఎజెండా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ ఎన్ఆర్ సదాశివా రెడ్డి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. సత్యసౌమ్య , చాగంటి రామిరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, ధనుంజయ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ సమగ్రతా చిహ్నంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు

రాయల వైభవం.. 'బసవన్న కట్ట'డం

- నేడు బసవేశ్వర జయంతి


అనంతపురం కల్చరల్: రాయలవారి పాలనలో జిల్లాలో ఎన్నో అపురూప కట్టడాలు నేటికీ చెక్కుచెదరలేదు. నాటి వైభవానికి సజీవ చిహ్నాలుగా నిలిచాయి. ఆ కోవలోనే నగరం నడిబొడ్డున నిర్మించిన ‹బసవన్న కట్ట› ఒకటి. ఈశ్వరారాధనే జీవన్ముక్తికి మార్గమని చాటిన మహా సంస్కర్త బసవేశ్వరుడి చరిత్రను చాటుతూ అపురూప కట్టడాన్ని నిర్మించారు. ఆదివారం జరగనున్న బసవేశ్వర జయంతికి ముస్తాబు చేశారు.

ఉట్టిపడుతున్న భక్తిభావం ..

పాతూరులో శతాబ్దాలుగా బసవన్న కట్టగా పూజలందుకుంటున్న ఈ ఆలయంలో అడుగడుగునా ప్రాచీన విశేషాలెన్నో కనిపిస్తాయి. కృష్ణదేవరాయల కాలం నాటి కట్టడాల్లో ఒకటిగా చెప్పుకునే ఈ ఆలయం.. నాటి హంపి శిల్పకళను మరిపిస్తుంది. జిల్లాలోనే అతిపెద్ద నందీశ్వరుల్లో ఒకరిగా భక్తిభావం ఉట్టిపడేలా ఉంటుంది. నాడు వేలాది ఎకరాల మాన్యం ఉండేదని శాసనాలు చెప్తున్నాయి. కాలక్రమంలో అవికాస్తా కరిగిపోయి ఆలయం కుంచించుకుపోయినా ఇక్కడ వీరశైవ మతస్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ.

నేడు నగరంలో సాంస్కృతిక కార్యక్రమాలు :

వీరశైవ సమాజం ఆధ్వర్యంలో 917వ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం ఉదయం 7.30 గంటలకు కర్ణాటక కళాకారులతో శోభాయాత్ర ఉంటుంది. వీరభద్రుడి వేషధారణతో కళాకారులు కత్తులు తిప్పుతూ ఒళ్లు గగుర్పొడిచే కళా విన్యాసాలు చేయనున్నారు. పలు ప్రధాన వీధుల గుండా నగరోత్సవం సాగుతుంది. అనంతరం కృష్ణా కళామందిర ప్రాంగణంలో పెద్ద ఎత్తున సమావేశం ఉంటుందని జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు ఎంజీ రాజు తెలిపారు. ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు విశిష్ట అతిథులుగా బసవేశ్వర జయంతిలో పాల్గొననున్నట్లు తెలిపారు.



బసవజయంతికి సుందరంగా ముస్తాబైన ఆలయం



శివతత్వాన్ని చాటిన మహాత్మ బసవేశ్వరుడు



పూజలందుకునే నిలువెత్తు నందీశ్వరుడు

నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలి

రాప్తాడు: విద్యా సంవత్సరం పూర్తికాకముందే కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఇంటింటికీ తిరిగి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని ఏఐఎస్ఏ నాయకులు మంజునాథ్ అన్నారు. నారాయణ విద్యా సంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఏ నాయకులు హంపాపురంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేశారు. ఆయన మాట్లాడుతూ అక్రమ అడ్మిషన్లు చేసే పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజా, ఉదయ్, రేవంత్ రెడ్డి, మదన్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఏ నాయకులు

సినిమా పాటల పోటీ

అనంతపురం కల్చరల్: అనంత సింగర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సినిమా పాటల పోటీలు ఉంటాయని నిర్వాహకులు సపారె రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపా రు. పోటీల్లో పాల్గొనదలిచేవారు విధిగా మ్యూజిక్‌తో పాటు పాటలు పాడాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9290 200675లో సంప్రదించాలన్నారు.

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్-బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి. 'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది' 'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే

డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదు గానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.

'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'అహా' అనిపించాయి.



'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మోఖాల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.



చక్రపాణి నగరి

"మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్ల వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.

కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను'' అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?



ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు... ఇలా రక్తంలోని కీలక కణాలకు పుట్టినిల్లు మూలుగ! కానీ అన్ని అవయవాల లాగే ఇది కూడా విఫలం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్ లాగే బోన్ మ్యారో ఫెయిల్యూర్ కూడా జరగవచ్చునన్న మాట. ఈ ఫెయిల్యూర్‌ను వైద్యపరిభాషలో 'అప్లాస్టిక్ అనిమియా' అంటారు. గతంలో కాస్త అరుదే అయినా ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోన్ మ్యారో ఫెయిల్యూర్ మీద అవగాహన కోసం ఈ కథనం.

నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బ తింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంలో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొర లో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.

కారణాలు : ● క్రిమిసంహారక మందులకు, ఆర్సెనిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంటీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్) : మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పైగా' (పీఐజీ-ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రోటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.

లక్షణాలు : అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం, దేని పైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం. చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం



డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం ముున్ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ : మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్: ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను తెస్తున్నాయి.

మెడి టిప్

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!



నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లా అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!

మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటివి లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గురైనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్తపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్-బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.

అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.

స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.



ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.